కుటుంబ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

- అన్ని రకాల వైద్యపరీక్షలతో పాటు ఉచిత మందులు అందజేస్తున్నాం
- డాక్టర్ రాజేష్


విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేస్తున్న సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్

తాడేపల్లిరూరల్: ప్రతికుటుంబానికి ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆంధ్రప్రదేశ్ వైద్యశాఖ ఆధ్వర్యంలో ప్రతి పీహెచ్‌సీ ద్వారా వాడవాడల జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందిస్తున్నామని ప్రభుత్వ వైద్యులు డాక్టర్ రాజేష్ అన్నారు. శనివారం ఎంటీఎంసీ పరిధిలోని పెనుమాకలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ పెనుమాకలో ముందుగానే ప్రతి ఇంటికి తిరిగి 7 రకాల వైద్యపరీక్షలు నిర్వహించామని, అక్కడే మందులు కూడా పంపిణీ చేశామని, ఎవరికైనా అదనపు పరీక్షలు అవసరమైతే పెనుమాక జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్షలో నిపుణులైన వైద్యుల చేత పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశాం. ఈ ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్‌తో పాటు ఇతర వైద్యపరీక్షలు నిర్వహించామని, పెనుమాకలో ఎవరికైతే కంటిచూపు మందగించిందో వారికి పెనుమాక వివిధ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ముందుగానే కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లు అందజేశామన్నారు. అలాగే ఎవరికైనా కంటికి సంబంధించి, ఇతర వ్యాధులకు సంబంధించి శస్త్రచికిత్స అవసరమైతే వారిని మెరుగైన వైద్య నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి గానీ, లేదా ఆరోగ్యశ్రీ కలిగి ఉన్న కార్పొరేట్ ఆసుపత్రికి గానీ పంపించి ఉచితంగా సేవలు అందిస్తున్నామని, వారితో పాటు వారి సహాయకులకు కూడా భోజన సదుపాయాలతో పాటు రవాణా ఖర్చులను అందజేస్తున్నామని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో వైద్యపరీక్షలు చేయించుకున్న వారికి వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజేష్, డాక్టర్ నరేంద్రబాబు, డాక్టర్ యస్‌కె మదీనా, డాక్టర్ టి. సాయిప్రతిమ, డాక్టర్ రమేష్, వైఎస్సార్ సీపీ పెనుమాక పార్టీ కన్వీనర్ దామేష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్‌సీ సెల్ నియోజకవర్గ నాయకులు బొక్క ప్రసన్న, పులి భుజంగరావు, బషీర్, సుభాని, తమ్మా శ్రీనివాస్ రెడ్డి, ఎఎస్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

జగన్‌తోనే ప్రతి కుటుంబానికి మేలు

ఫిరంగిపురం: ప్రతి కుటుంబానికి మేలు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. మండలంలోని అమీనాబాద్ గ్రామంలోని ఉర్దూపాఠశాలలో జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. శిబిరంలో కత్తెర సురేష్‌కుమార్ పాల్గొని ఎందరికి వైద్యపరీక్షలు నిర్వహించారు, మరెందరిని పెద్ద వైద్యశాలకు రిఫర్ చేసారనే దానిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. శిబిరంలో అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. వైఎస్సార్ కంటివెలుగులో పరీక్షలు చేయించుకున్న విద్యార్థులకు కళ్లజోళ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో రానున్న ఎన్నికల్లో ప్రతిపక్ష నాయకులు ముఠాగా ఏర్పడి ప్రజలను మభ్యపెట్టేందుకు వస్తారని చెప్పారు. క్రమశిక్షణ, ప్రజల ఎడల ప్రేమ ఉన్న నాయకుడు జగన్‌ను ఎవరూ ఏమి చేయలేరని వ్యాఖ్యానించారు. ఆడిన మాట తప్పకుండా తాను ప్రజలకు ఎంతవరకు మేలు చేయాలని అనుకున్నాడో అంతగా మేలు చేసి ప్రజల ఆదరాభిమానాలు ముఖ్యమంత్రి పొందారని తెలిపారు. నవరత్నాలలో భాగంగా ఎన్నోపథకాలు ప్రవేశపెట్టి ఇతర రాష్ట్రాల వారు మనరాష్ట్రం వైపు ఆశ్చర్యంగా చూసేలా చేస్తున్నారని చెప్పారు. ప్రతి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహించడం ద్వారా రోగరహిత ఆంధ్రప్రదేశ్‌గా చేయాలన్నదే ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ఎ.శ్రావణ్ బాబు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్యసేవలు జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందుతున్నాయన్నారు. ఎన్నో శ్రమలకోర్చి నిర్విరామంగా పనిచేస్తున్న ఆరోగ్య సిబ్బందిని అభినందించారు.


శిబిరంలో వివరాలు తెలియజేస్తున్న ఆరోగ్యసిబ్బంది


వైద్యశిబిరంలో రోగికి ఈసీజీ తీస్తున్న సిబ్బంది


పెనుమాకలో మందులు అందజేస్తున్న డాక్టర్ రాజేష్

దేశంలో మరెక్కడా ఇటువంటి ఫ్యామిలీ డాక్టర్ అనే పథకం లేదని అందుచేతనే ఇతర రాష్ట్రాల వారు ఈ పథకం పనితీరు గురించి వివరాలు తెలుసుకుంటున్నారని చెప్పారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఎన్నో జబ్బులు నయం చేస్తున్నారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ చేయించుకున్న వారికి కుటుంబ పోషణ నిమిత్తం వెయ్యి నుంచి రూ.30 వేల వరకు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు దాసరి కత్తిరేణమ్మ, సర్పంచ్ కె.చిన్న ఎంపీటీసీ సభ్యులు ఎ. అనూరాధ, సకిల లక్ష్మీ, గాంధీబుడే, కె.ఆనంద్, చిట్టా అంజిరెడ్డి, ఎం. సుధాకర రెడ్డి, రఫి, కె. సురేష్, సుభానీ, ఎంపీడీవో డి.అనూరాధ, వైద్యులు పి.ఎస్తేరు రాణి, యానీగ్రేస్, శరత్, భీమేష్ నాయక్, సీహెచ్‌వో వెంకట రమణ, హెచ్‌వీ అన్నమేరి, కార్యదర్శి ఏకేబాబు, ఏఎన్‌ఎం అరుణ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీగణపతి హోమం



ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామంలోని కోదండ రామాలయంలో శనివారం వైభవంగా నవగ్రహ, లక్ష్మీగణపతి హోమం నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో అర్చకులు కృష్ణమూర్తి స్వామివార్లకు విశేష పూజలు, అష్టోత్తర, సహస్రనామ పూజలు నిర్వహించారు. అనంతరం స్మార్తపండితులు నారాయణం లక్ష్మీరఘురామ్, సాయిచందు, వినయ్‌కుమార్‌లు మండపారాధన, పంచపాలక పూజ, కళశ స్థాపన, నవగ్రహ మండపారాధన నిర్వహించి లక్ష్మీగణపతి హోమం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తాడేపల్లిలో వ్యాసరచన పోటీలు



తాడేపల్లిరూరల్: పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళగిరిలోని బెటాలియన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం పాఠశాలల, కళాశాలల్లోని విద్యార్థులకు, పోలీస్ ఉద్యోగస్తులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా కమాండ్ కెఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు పోలీస్ అమరవీలు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళగిరిలోని వివిధ పాఠశాలల్లోను, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు లైంగిక వేధింపుల నుంచి మహిళలు పిల్లల రక్షణ-సామాజిక పాత్ర అనే అంశం మీద, పోలీస్ ఉద్యోగులకు సోషల్ మీడియా దుర్వినియోగం సైబర్ మోసాలను అరికట్టడంలో సాంకేతిక పాత్ర అనే అంశంపై వక్తృత పోటీలను, వ్యాసరచన పోటీలు నిర్వహించామని, పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ ఈఎస్ సాయి ప్రసాద్, అసిస్టెంట్ కమాండెంట్లు మురళీకృష్ణ, దేవానంద్, మల్లిఖార్జున్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరి అర్బన్ ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ముసాయిదా ఓటర్ల జాబితాను శనివారం వేరువేరు ప్రాంతాల్లో మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ అసిస్టెంట్ ఎలక్టోల్ రిజిస్టర్ ఆఫీసర్ అడిషనల్ కమిషనర్ హేమమాలిని, డిప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్బన్ పరిధిలో ఉన్న పోలింగ్ బూత్‌లకు సంబంధించి ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయడం జరిగిందని, అర్బన్ పరిధిలోని ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద ఏర్పాటు చేయడం జరిగిందని, ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, అభ్యంతరాలు ఉన్నపక్షంలో ఓటర్లు డిసెంబర్ 9వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఫారం 6,7,8 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌వోలు, వీఆర్‌ఎలు పాల్గొన్నారు.

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కేఎల్‌యూ ఒప్పందం

తాడేపల్లిరూరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కేఎల్‌యూ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుని ఒప్పంద పత్రాలను పరస్పరం మార్చుకున్నట్లు యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు వెల్లడించారు. శనివారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కేఎల్‌యూలో ఏర్పాటు చేసిన రక్తదాన అవగాహన సదస్సుకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదానం చేసిన విద్యార్థులు ఓ వ్యక్తి నిండు ప్రాణంతోపాటు ఒక కుటుంబానికి భరోసా కల్పించిన వారు అవుతారన్నారు. రక్తదానం చేసిన వారికి ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఇచ్చే సర్టిఫికెట్ విద్యార్థులకు ఉద్యోగ అన్వేషణ సమయంలో చాలా ఉపయోగపడుతుందని వివరించారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల జాబితాలో కేఎల్‌యూ విద్యార్థులు రక్తదానం చేయడంలో ముందజలో ఉన్నారన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీతో కలసి పనిచేయడం తమకు చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకట్‌రామ్, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు, సాక్ డైరెక్టర్ సాయి విజయ్, యూత్ రెడ్‌క్రాస్ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జి డాక్టర్ కె. సుకీర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి


మాట్లాడుతున్న కత్తెర సురేష్ కుమార్

తాడికొండ: త్వరలో రానున్న ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండి ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ సూచించారు. శనివారం గుంటూరులోని తన కార్యాలయంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, ఎన్నికల మండల కో ఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కోసం నవరత్నాలు కాకుండా ఇంకా అనేక పథకాలు చేపట్టిందని, వాటిని ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. ప్రతి గడపకు ప్రభుత్వం ద్వారా అందిన సంక్షేమం, అభివృద్ధిని వివరించాలని, జగనన్న ఆరోగ్య సురక్ష, పేదలకు ఇస్తున్న సంక్షేమం, విద్య, వైద్యం, వ్యవసాయం కోసం ప్రభుత్వం చేయూతనిచ్చిన వివరాలు తెలియజేయాలన్నారు. ప్రజలకు పాలన చేరువ చేసేందుకు సచివాలయాలు రైతు భరోసా కేంద్రాల నిర్మాణం, వలంటీర్ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలను తెలియజేయాలన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి కృష్ణానది తీరంలో వున్న మణిపాల్ హాస్పిటల్ తమ వైద్య సేవలను గ్రామగ్రామాన విస్తరించి, క్యాన్సర్ స్క్రీనింగ్ సేవలు నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మణిపాల్ హాస్పిటల్ విజయవాడ బ్రాంచ్ డైరెక్టర్ డాక్టర్ కంటిపూడి సుధాకర్ మాట్లాడుతూ మణిపాల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్ట్ కోసం ప్రత్యేక బస్సును ఏర్పాటు చేసి ఉమ్మడి గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలో అందించామన్నారు.

దశాబ్దకాల విద్యుత్ సమస్యకు పరిష్కారం

- ఎమ్మెల్యే ఆర్కే చొరవ
- నవులూరులో కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు


విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి 133 సబ్‌స్టేషన్ నుంచి నవులూరు మీదుగా 33 కె.వి. లైన్లను ఏర్పాటు చేశారు. సుమారు 65 సంవత్సరాల నుంచి 33 కె.వి.లైన్ల వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందికి గురవుతున్నారు. మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) నవులూరు మక్కేవారి పేటకు వచ్చిన సందర్భంగా ఆయనకు 33 కె.వి. విద్యుత్ లైన్ల కారణంగా ఇళ్లను నిర్మించు కోలేకపోతున్నామని, చాలా ఇబ్బంది పడుతున్నామని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన 24 గంటలో కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులను కోరడంతో, శనివారం విద్యుత్‌శాఖ అధికారులు కిందకు వేలాడుతూ ఇళ్లమీద నుండి వెళుతున్న విద్యుత్ వైర్లను మార్చడం ప్రారంభించారు. సుమారు 40 స్తంభాలు కొత్తవి తీసుకు వచ్చి పాత స్తంభాలను తొలగించి కొత్త లైన్ల ఏర్పాటు శ్రీకారం చుట్టారు. గతంలో ఈ ప్రాంతంలో విద్యుత్ వైర్లు కిందకు ఉండడం వల్ల విద్యుత్ ఘాతుకానికి గురై కొంతమంది శాశ్వత అంగవైకల్యం పొందడం, కొంతమంది మరణించడం జరిగింది. ఆప్రాంతంలో విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడం పట్ల ప్రజలు ఎమ్మెల్యే ఆర్కేకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యుత్‌శాఖ ఎస్ఇ విజయ్‌కుమార్ మాట్లాడుతూ మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి మక్కేవారిపేటలో ఉన్న పరిస్థితులను వివరించారని, వారితో పాటు మాకు కూడా తెలియజేయడంతో ఈ విద్యుత్ స్తంభాలను మారుస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

ఘనంగా ఆదికవి వాల్మీకి జయంతి


అమరావతి వాల్మీకి సేవాసమితి ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు



వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి గ్రామస్తులు

తాడేపల్లిరూరల్: రామాయణ గ్రంథసృష్టికర్త, ఆదికవి, మహర్షి వాల్మీకి జయంతి వేడుకలను శనివారం ఎంటీఎంసీ పరిధిలోని యర్రబాలెం ఇండస్ట్రీ కాలనీలో అమరావతి వాల్మీకి సేవాసమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా వాల్మీకి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు మాట్లాడుతూ రామాయణ గ్రంథం ద్వారా మానవ జీవన విధానం, మనుషుల మధ్య అనుబంధాలు తెలియజేయడమే కాకుండా లోక కళ్యాణం కోసం పాటుపడాలని తెలియజేసిన గొప్ప వ్యక్తి వాల్మీకి అని అన్నారు. వాల్మీకి జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ జీవితంలో చెడు అలవాట్లను వదిలిపెట్టి మంచి పనులను చేస్తూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని వారు సూచించారు. వాల్మీకి బోయలకు ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన అధ్యక్షులు కుమ్మరి క్రాంతి కుమార్, గుంటూరు జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, నియోజకవర్గ యువజన అధ్యక్షులు ఆలా శివాజీ, జిల్లా మహిళా కో ఆర్డినేటర్ స్వాతి, బీసీ సంక్షేమ సంఘం కళామతల్లి రాష్ట్ర అధ్యక్షులు ముప్పాన వెంకటేశ్వర్లు, అమరావతి వాల్మీకి సేవా సమితి కమిటీ అధ్యక్షులు నల్లబోతుల లక్ష్మయ్య, ఉపాధ్యక్షులు కామినేని సాంబశివరావు, ప్రధాన కార్యదర్శి మినుగు రామకృష్ణ, కోశాధికారి మైల రవీంద్రబాబు, కార్యదర్శులు నల్లబోతుల సుబ్బారావు, మినుగ పవన్‌కుమార్, మైల శ్రీనివాస్, నల్లబోతుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాడికొండలో...

తాడికొండ: రామాయణ మహాకావ్య రచన చేసిన వాల్మీకి జీవితం అందరికీ ఆదర్శమని తాడికొండ గ్రంథాలయాధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. మహర్షి వాల్మీకి జయంతిని పురస్కరించుకొని తాడికొండ శాఖా గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి చింతల భాస్కరరావు, రంగారావు, పులి హనుమయ్య, ఎన్.అప్పారావు, ఎన్.చలపతిరావు, జి.సత్యన్నారాయణ, ప్రసాద్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

స్టేట్ లెవల్ కరాటే పోటీలకు విద్యార్థుల ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో కరాటే మాస్టర్లు

తాడేపల్లిరూరల్ : ఉమ్మడి గుంటూరు జిల్లాలో స్కూల్‌గేమ్స్ ఆధ్వర్యంలో ఆటల పోటీలతో పాటు కరాటే పోటీలను కూడా నిర్వహిస్తున్నారు. శనివారం మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్‌పరిధిలోని కుంచనపల్లి అరవింద్ స్కూల్‌లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన కరాటేకు విద్యార్థులకు ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధికారి, డాక్టర్ ఉదయ్‌రాజ్ కరాటే పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుంటూరు, బాపట్ల, నరసరావుపేటలోని పలు పాఠశాలల నుంచి 70 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, కరాటేలో నైపుణ్యం సంపాదించిన నడుమ ఈ పోటీలను నిర్వహించామని, 30 మంది విద్యార్థులు స్టేట్ లెవల్‌లో తమ ప్రతిభను చూపించేందుకు ఎంపిక అయ్యారని, నవంబర్ 9,10,11 తేదీల్లో పార్వతీపురంలో జరిగే స్టేట్ సెలక్షన్ పోటీల్లో తమ ప్రతిభకు కనబరుస్తారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్లు అనీల్, మాలిక్‌రవి, మహేష్, కిరణ్‌రెడ్డి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

తల్లీ, బిడ్డల అదృశ్యం



తాడేపల్లిరూరల్ : మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కనిపించకుండా పోయిన తల్లీకొడుకుల సంఘటన ఆలస్యంగా శనివారం వెలుగులోకి వచ్చింది. నవులూరు చెందిన హానోక్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళగిరి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నవులూరుకు చెందిన గొరికెపూడి రోజా కొల్లూరు మండలం, దోనేపూడిలో భర్తతో కలసి నివాసముంటోంది. దసరా పండుగ సందర్భంగా నవులూరు వచ్చిన రోజా ఈనెల 24వ తేదీన తిరిగి దోనేపూడి వెళ్లింది. అయితే ఆమె ఇప్పటి వరకు ఇంటికి చేరలేదు. భర్త రోజా రాలేదని రోజా తమ్ముడైన ఆళ్ళమూడి హానోక్ బాబుకు తెలియజేశారు. అప్పటి నుంచి చుట్టు పక్కల, బంధువుల ఇళ్లలో విచారించారు. 24వ తేదీ మంగళగిరి బస్టాండ్‌లో రోజాను తెనాలి బస్సు ఎక్కించామని, ఏమైందో ఏమిటో తెలియదు కానీ రోజాతో పాటు ఆమె కుమారులైన శామ్యూల్, ప్రేమ్‌కుమార్‌లు కూడా కనిపించడం లేదని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు.

త్రిశక్తి స్వరూపిణి తులసీ పార్వతీదేవి

కంతంరాజుకొండూరు(తెనాలి): ధైర్యవంతుడు, విద్యావంతుడు, సేవచేసేవారు గొప్ప వారుగా కీర్తిని పొందుతారని, ఆ మూడు సద్గుణాలు కలిగిన డాక్టర్ పోలవరపు తులసీపార్వతీదేవి త్రిశక్తి స్వరూపిణిగా చిత్తూరు జిల్లా, ఏర్పేడులోని వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతులు పరిపూర్ణానందగిరి స్వామి అభివర్ణించారు. ప్రవాస భారతీయురాలు డాక్టర్ పోలవరపు తులసీపార్వతీదేవి స్వస్థలమైన దుగ్గిరాల మండల గ్రామం కంతంరాజుకొండూరులోని కారుమంచి గోవిందయ్య ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మించిన మెమోరియల్ బ్లాక్‌ను, ఆమె కాంస్యవిగ్రహాన్ని శనివారం శ్రీపరిపూర్ణానందగిరి స్వామి ఆవిష్కరించారు. సభకు కారుమంచి రత్తమ్మ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు, డాక్టర్ పోలవరపు రాఘవరావు అధ్యక్షత వహించారు.కోశాధికారి డాక్టర్ జెట్టి ప్రసాద్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ కల్పన రఘునాథ్, డాక్టర్ పిన్నమనేని ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చదలవాడ సుధ, జిల్లా పరిషత్ మాజీ ఛైర్మన్ పాతూరి నాగభూషణం, శ్రీకృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

ఎరువులకు కొరత లేదు

తాడేపల్లిరూరల్ : రైతులకు ఎరువుల కొరత లేదని వ్యవసాయ సహాయ సంచాలకులు శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒకప్రకటనలో తెలిపారు. మంగళగిరి సబ్ డివిజన్ పరిధిలోని మంగళగిరి, తాడేపల్లి, తుళ్ళూరు, తాడికొండ మండలాల్లో రైతులకు ఎరువులు అన్ని ప్రైవేటు డీలర్లు, సొసైటీలు, రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, మంగళగిరి మండలంలో యూరియా 170 టన్నులు, కాంప్లెక్స్ 215 టన్నులు, డీఏపీ 113 టన్నులు, యస్‌యస్‌పి 69 టన్నులు, ఎంఓపి 65 టన్నులు అందుబాటులో ఉన్నాయని, తాడేపల్లి మండలంలో యూరియా 80 టన్నులు, కాంప్లెక్స్ 118 టన్నులు, డీఏపీ 15 టన్నులు, యస్‌యస్‌పి 15 టన్నులు,ఎంఓపీ 17 టన్నులు, తుళ్ళూరు మండలంలో యూరియా 165 టన్నులు, కాంప్లెక్స్ 125 టన్నులు, డీఏపీ 15 టన్నులు, యస్‌యస్‌పి 12 టన్నులు, ఎంఓపీ 16 టన్నులు, తాడికొండ మండలంలోన యూరియా 123 టన్నులు, కాంప్లెక్స్ 113 టన్నులు, డీఏపీ 18 టన్నులు, ఎంఓపీ 65 టన్నులు అందుబాటులో ఉన్నాయని, రైతులకు ఎరువులు అందుబాటులో ఉండేందుకు ఎప్పటికప్పుడు ఎరువుల కోసం ఇండెంట్స్ పెట్టమని రైతు భరోసా సిబ్బందికి, అధికారులకు, సొసైటీలకు, ప్రైవేటు డీలర్లకు ఆదేశాలు జారీచేశామని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు.

ప్రతీ బూత్‌లో ఓటర్ల లిస్ట్ అందుబాటులో ఉంచండి

- ప్రజల అభ్యంతరాలను నమోదు చేయండి
- తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి


మాట్లాడుతున్న తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి

తాడేపల్లిరూరల్: 2024 ఎన్నికల ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేశారని ప్రతి బూత్‌లోనూ ఆ ఓటర్ల లిస్ట్‌ను ప్రజలకు అందుబాటులో ఉంచాలని తాడేపల్లి తహసీల్దార్ మర్రెడ్డి నాగిరెడ్డి అన్నారు. శనివారం తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయంలో కొత్త ఓటర్ల లిస్టు రావడంతో డిప్యూటీ తహసీల్దార్ సతీష్‌తో కలసి తాడేపల్లి పట్టణ, మండల పరిధిలోని బీఎల్‌ఓలతో ఆయన విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు.

కొత్తగా నమోదైన ఓటర్ల లిస్టుతో ఓటర్ల నమోదు కార్యక్రమం పూర్తి కాలేదని, జనవరి 5వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరి ఓటు నమోదు చేయాలన్నారు. అలాగే ఇప్పుడు ప్రచురించిన ఓటర్ల లిస్టును బూత్ లెవల్‌లో మరొకసారి పరిశీలించి ప్రజలముందు ఉంచాలని సూచించారు. ఆ ఓటర్ల లిస్ట్‌లు ఏమైనా తప్పిదాలు ఉన్నా సంబంధిత వ్యక్తుల దగ్గర నుంచి రాతపూర్వకంగా దరఖాస్తు తీసుకుని వాటిని సరిచేయడంతో పాటు అభ్యంతరాలను కూడా సేకరించవచ్చని ఓటర్లు తొలగింపు విషయంలో క్షుణ్ణంగా పరిశీలించవలసి ఉందని, తొలగించే క్రమంలో ఏమైనా తప్పిదాలు చేస్తే వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ షఫీర్ అహమ్మద్, ఆర్‌ఐలు వంశీకృష్ణ, ప్రశాంతి పాల్గొన్నారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోండి

- దోమలను నివారించండి
- మలేరియా అడిషనల్ డైరెక్టర్ వీర్రాజు


కూలర్‌లో నిల్వఉన్న నీటిలో దోమలను చూపిస్తున్న వీర్రాజు

తాడేపల్లిరూరల్: ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా వ్యక్తిగతంగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని దోమలను నివారించేందుకు చర్యలు చేపట్టాలని గుంటూరు జోనల్ మలేరియా అడిషనల్ డైరెక్టర్ వీర్రాజు అన్నారు. శనివారం ఎంటీఎంసీ పరిధిలోని మంగళగిరి లక్ష్మీనరసింహ స్వామి కాలనీలో ఆయన దోమల నివారణపై విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ, ఇతర జ్వరాలు దోమల వల్లే వస్తాయని, ఆ దోమలను నివారించేందుకు ప్రతి ఒక్కరు తమ ఇళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రతి నివాసంలో దోమలు ఎక్కడ నివాసాలు ఉంటాయో అనేది ప్రత్యక్షంగా గృహిణులకు వివరించామని, సుమారు 100 గృహాలను పరిశీలించి వారి వారి ఇళ్లలో వున్న బట్టలు పెట్టుకునే ర్యాక్ లు, బీరువాల మాటు, ఇంటి పైకప్పులో దోమలు నివాసాలు ఎలా ఏర్పాటు చేసుకుంటాయో వారికి చూపించామని, అలాగే పక్కన పెట్టిన కూలర్లు, రోళ్లు, పూల కుండీలు, ఇతర మంచినీటి తొట్టెలలో దోమలు ఆవాసాలు ఎలా ఏర్పాటు చేసుకుంటాయో, వాటికి నివారణ ఏమిటో వివరించామని ఆయన తెలిపారు. దోమలు వాటి శరీర భాగాల్లో సూక్ష్మంగా ఉన్న వ్యాధి కారకాల గురించి, ఆ దోమలను నాశనం చేయడానికి ఏఏ మందులు పని చేస్తాయో, దోమల నివారణకు మందులను సైతం సూచించామన్నారు.

దోమల నివారణ ఎలాగో తెలియక ఎంతోమంది వ్యాధుల బారిన పడుతున్నారని వారికి వివరించామని అన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి కోడెల శ్రీనివాసరావు, ఎ. శ్రీమన్నారాయణ, సూపర్‌వైజర్ ఎం సాగర్, సైదులు, హెల్త్ అసిస్టెంట్ నరసింహారావు, నరసింహమూర్తి, నూకరాజు, ఆశావర్కర్ కళావతి మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్ కప్ పోటీలకు షేక్ సాధియా

తాడేపల్లిరూరల్: స్లోవేనియాలో ఈనెల 30 నుంచి నవంబర్ 4 వరకు జరగనున్న వరల్డ్ యూనివర్శిటీ పవర్ లిఫ్టింగ్ కప్ పోటీలకు మంగళగిరి పట్టణ పరిధికి చెందిన అంతర్జాతీయ పవర్ లిఫ్టర్ షేక్ సాధియా నేడు ప్రయాణం కానున్నట్లు కోచ్ యస్‌కె సందాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలో కె.ఎల్.యూనివర్శిటీలో షేక్ సాధియా ఎంబీఏ చదువుతున్నదని, ఈ పోటీలలో భారతదేశం నుంచి నలుగురు పవర్ లిఫ్టర్లు పాల్గొంటున్నారని, వారిలో ఆంధ్రప్రదేశ్ నుండి సాధియా పాల్గొనడం గర్వకారణమని, 57 కేజీల విభాగంలో పాల్గొని పతకం సాధిస్తుందని, సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు, ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు మద్ది ప్రభాకరరావు, ఏపీ పవర్ లిఫ్టింగ్ కార్యదర్శి సకల సూర్యనారాయణ, ఏపీ పవర్ లిఫ్టింగ్ గౌరవ అధ్యక్షులు గంట వెంకటేశ్వరరావు, విజయ భాస్కరరావు, అభినందించారు.